ప్రజాశక్తి
శనివారం 17 డిసెంబర్ 2022 | 5 | కర్నూలు

సమావేశంలో మాట్లాడుతున్న జెసి రామ సుందర్ రెడ్డి

నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై క్రిమినల్ కేసులు

- జెసి రామ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో రైతులకు నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని జెసి ఎస్.రామ సుందర్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిఎం కిసాన్ పథకానికి సంబంధించి ఈకేవైసీ చేయించుకోని రైతులకు అవగాహన కల్పించి ఈకేవైసీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్లు తప్పకుండా పని చేసేలా వ్యసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉద్యానవన శాఖకు సంబంధించి జిల్లాలో ఫ్లోరికల్చర్ సాగుకు వీలుగా కలెక్టర్ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు గోనెగండ్ల, ఆదోని, కల్లూరు మండలాల్లో పర్యటించి ఫ్లోరికల్చర్ సాగుకు అనుకూలతను పరిశీలించారని చెప్పారు. జిల్లాలో వెదురు సాగు పెంపునకు కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్‌కు సంబంధించి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాల సాధనకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఎపిఎంఐపి పీడీ ఉమాదేవిని ఆదేశించారు. ఆదోని ప్రాంతంలో ఉపాధి కల్పన కార్యక్రమాలపై హార్టికల్చర్, పశు సంవర్ధక శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఆదోని ప్రాంతంలో కమ్యూనిటీ ఫారంపాండ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మాంసం, పౌల్ట్రీ, పాడి పరిశ్రమ అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన తదితర పథకాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఫిషరీస్ అధికారి శ్యామలకు సూచించారు. అనంతరం జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి మాట్లాడారు. డ్రోన్ యూనిట్ల మంజూరుకు సంబంధించి గ్రూపుగా కాకుండా వ్యక్తిగతంగా మంజూరు చేసే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లాలో ఇంకా 44 డ్రోన్ యూనిట్లను ఎంపిక చేయాల్సి ఉందని, వీటిని త్వరగా ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఈ అంశంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ, మార్కెటింగ్, ఉద్యాన, ఎపిఎంఐపి, మార్క్ ఫెడ్ తదితర శాఖల అధికారులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

సీరియస్ క్లాస్...

- తీరు మారకుంటే టికెట్ లేనట్టే - ఎమ్మెల్యేల పనితీరుపై సిఎం సమీక్ష

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

పలువురు ఎమ్మెల్యేలకు, మంత్రులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సీరియస్‌గా క్లాస్ తీసుకున్నారు. పనితీరు మెరుగుపరచుకోకుంటే ఈసారి టికెట్ లేనట్టేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల పనితీరు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మీద శుక్రవారం ముఖ్యమంత్రి జగన్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లడమే లక్ష్యంగా 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం రూపొందించామని, ఆ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించని వారు ప్రజల్లోకి వెళ్లనట్టేనని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 32 మంది ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి సీరియస్ వార్నింగ్ ఇవ్వగా అందులో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి ముగ్గురు ఉన్నట్లు సమాచారం. పనితీరు సరిగ్గా లేని కొందరు మంత్రులను కూడా గట్టిగా హెచ్చరించినట్లు తెలిసింది. వారిలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఓ మంత్రికి కూడా ముఖ్యమంత్రి గట్టిగా క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది మార్చి వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని, మళ్లీ మార్చిలో మరోసారి సమీక్ష నిర్వహిస్తానని తెలిపినట్లు సమాచారం. అప్పటికీ పని తీరు మెరుగుపరుచుకోకపోతే అలాంటి వారికి వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజల్లోకి వెళ్లేందుకు ఇంకా వంద రోజులు మాత్రమే సమయం ఉందని, ఆ సమయాన్ని వినియోగించుకో లేకుంటే రాబోయే ఎన్నికల్లో గెలుపు కష్టతరంగా మారుతుందని ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలతో చెప్పినట్లు సమాచారం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ప్రశ్నలకు సరైన రీతిలో సమాధానం ఇవ్వకుండా వార్తల్లోకి ఎక్కిన ఎమ్మెల్యేలకు కూడా ప్రత్యేకంగా క్లాస్ తీసుకున్నట్లు తెలిసింది. ప్రజల ప్రశ్నకే సమాధానం చెప్పలేకుంటే ప్రభుత్వ పథకాల గురించి పూర్తిస్థాయిలో ఎలా అవగాహన కల్పిస్తారని జగన్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. వచ్చే సమీక్షలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను కూడా ఖరారు చేసే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలిసింది.

సమీక్షలో మాట్లాడుతున్న సిఎం జగన్

సమీక్షకు హాజరయిన నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

- శ్రామిక మహిళా సంఘం, ఐద్వా డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో తోడికోడళ్లు రామేశ్వరమ్మ, రేణుకను హత్య చేసిన వారి మామ పెద్ద గోదన్న, భర్తలు చిన్న రామ గోవిందు, పెద్ద రామ గోవిందును కఠినంగా శిక్షించాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ధర్నాకు ఐద్వా నగర కార్యదర్శి బి.పద్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పి.నిర్మల, ఎన్.అలివేలమ్మ మాట్లాడారు. రామేశ్వరమ్మ, రేణుకను పెళ్లి చేసుకున్న చిన్న రామ గోవిందు, పెద్ద రామ గోవిందులకు పిల్లలు పుట్టలేదనే కారణం, వారికి మర్లు మందు పెట్టారన్న అనుమానంతో పొలాలకు తీసుకెళ్లి వారి మామ, భర్తలు అతి కిరాతకంగా గొంతు కోసి చంపడం దుర్మార్గమన్నారు. జిల్లా పోలీసులు హత్య జరిగిన ప్రాంతంలో డాగ్ స్క్వాడ్ నిర్వహించడంతో నిందితులు దొరికిపోయారన్నారు. జీవితాంతం కలిసి బతకాల్సిన భర్తలే దుర్మార్గంగా, కర్నూలు జిల్లాలో ఎప్పుడూ జరగని విధంగా హత్య చేయడం ఘోరమన్నారు. ఈ హత్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. మహిళల ఓట్ల కోసం మహిళా సాధికారిక పేరుతో మహిళా రక్షణ చట్టాలు చేస్తున్నారన్నారు తప్ప వాటిని కఠినంగా అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని అన్నారు. మాటలు చెప్పడం కాకుండా మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు పిఎస్.సుజాత, కెఎస్.పద్మ, కామరూన్‌బీ, అమీనా, ఎం.కుమారి, పి.నోమేశ్వరి, టి.బాల లక్ష్మి, శాంతమ్మ, సావిత్రమ్మ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

కట్టుకున్న వారే కడ తేర్చారు...

- మామ, భర్తల అనుమానమే ఆ ఇద్దరి ప్రాణాలు తీసింది
- సంతానం కలగలేదన్నదీ మరో కారణం
- వీడిన మహిళ జంట హత్యల కేసు మిస్టరీ
- వివరాలు వెల్లడించిన అడిషనల్ ఎస్పీ ప్రసాద్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఇటీవల జిల్లాలో కలకలం రేపిన మహిళల జంట హత్యల కేసు మిస్టరీని కర్నూలు జిల్లా పోలీసులు ఛేదించారు. కేసు వివరాలను జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్ శుక్రవారం కర్నూలు నగరంలోని రూరల్ పోలీసు స్టేషన్‌లో వెల్లడించారు. ఆయన కథనం మేరకు... ఓర్వకల్లు మండలం నన్నూరు కురువ వీధికి చెందిన కురువ పెద్ద గోవర్ధన్ అలియాస్ గోగన్నకు ఇద్దరు కుమారులు. పెద్ద రామ గోవిందు, చిన్న రామ గోవిందులు. కుమార్తె చిన్న రామ గోవిందమ్మ. పెద్ద కుమారుడు పెద్ద రామ గోవిందుకు గూడూరు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన రామేశ్వరితో ఐదేళ్ల క్రితం వివాహం చేశారు. చిన్న కుమారుడు చిన్న రామ గోవిందుకు లక్ష్మీపురం గ్రామానికి చెందిన రేణుకతో రెండేళ్ల క్రితం వివాహం చేశారు. వీరిద్దరికీ సంతానం కలుగలేదు. చిన్న రామగోవిందుతో రేణుక వివాహం తండ్రి గోవర్ధన్‌కు, పెద్ద రామ గోవిందుకు మొదటి నుంచి ఇష్టం లేదు.

అనుమానమే నెత్తురు కళ్ల చూసింది

హత్య ఘటనకు రెండు నెలల ముందు మృతుల మామ గోవర్ధన్, పెద్ద రామ గోవిందుకు మరలు మందు పడిందన్న అనుమానం నెలకొంది. విరుగుడు కోసం నగరంలోని జొహరాపురానికి చెందిన మఠం పార్వతమ్మను ఆశ్రయించారు. తినే అన్నంలో ఎవరో మర్లు మందు పెట్టారని, దానిని తొలగించడం వల్ల బతికి బయటపడ్డారని, లేదంటే చచ్చి ఉండేవారని పార్వతమ్మ చెప్పారు. ఇంట్లో వారే అన్నంలో మందు పెట్టారని, వారి చావుకు ప్రణాళిక రచించారని అనుమానం బలంగా నాటుకుంది. గోవర్ధన్ ఇద్దరు కుమారులతో సమావేశమయ్యారు. తమ ముగ్గురిని చంపేలోపే కోడళ్లిద్దరినీ అంతమొందించాలని తీర్మానించుకున్నారు. దీనికి తోడు హత్య ఘటనకు రెండురోజుల ముందు రాత్రి చిన్న కోడలు రేణుక పడుకున్న గది కిటికీ బయటి నుంచి గుర్తుతెలియని వ్యక్తి తొంగి చూస్తుండగా పెద్ద రామ గోవిందు గమనించారు. ఆ వ్యక్తిని పట్టుకోబోయే ప్రయత్నం చేయగా అక్కడి నుంచి తప్పించుకు పారిపోయాడు. ఆ వ్యక్తి తప్పనిసరిగా రేణుక కోసమే వచ్చాడని, ఇది కుటుంబ పరువు తీసేదిగా ఉందని తండ్రి, కొడుకులు చర్చించుకున్నారు. ఈ ఇద్దరినీ ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 14న పెద్ద రామ గోవిందు వారిద్దరినీ బైక్‌పై ఎక్కించుకొని నన్నూరు నుంచి తడకనపల్లెకు వెళ్లే రహదారిలో ఉన్న మంగలి పొలం వద్ద వదిలి వచ్చారు. పథకం ప్రకారం ఊళ్లో నుంచి గోవర్ధన్, కంది పొలానికి సమీపంలో గొర్రెలను కాస్తూ చిన్న రామ గోవిందు, ఎడ్ల బండిని కట్టుకొని పెద్ద రామ గోవిందు రావాలని అనుకున్నారు. అనుకున్న సమయానికి మహిళలిద్దరూ పని చేస్తున్న కంది పొలం వద్దకొచ్చారు. ఇద్దరు కుమారులు పొలానికి అటు, ఇటు వైపు కాపలా ఉండగా గోవర్ధన్ తన వెంట తెచ్చుకున్న వేప కర్రతో మొదట రేణుకను, తర్వాత రామేశ్వరిని తలపైనా, ముఖంపైనా బాదారు. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల పుట్టింటి వారి ఫిర్యాదు మేరకు ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

నిందితుల గుట్టు విప్పిన కాలి చెప్పు

నిందితులు ఘటన స్థలంలో వదిలి వెళ్లిన చెప్పు వారిని పోలీసులకు పట్టుబడేలా చేసింది. రేణుకను గోవర్ధన్ మట్టుపెట్టే క్రమంలో రామేశ్వరి అడ్డుకోబోయారు. ఆపై తిరగబడ్డారు. గమనించిన చిన్న రామ గోవిందు వెనుక వైపు నుంచి వచ్చి రామేశ్వరి నోరు గట్టిగా మూసి అరుపులు బయటికి వినిపించకుండా నొక్కి పట్టారు. చివరికి ఊపిరాడక అక్కడే ప్రాణాలు వదిలారు. వీరి మధ్య జరిగిన పెనుగులాటలో చిన్న రామ గోవిందు కాలి చెప్పు తెగి అక్కడే పడిపోయింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించే సమయంలో ఆ చెప్పు వారి కంట పడింది. చివరికి అదే బలమైన సాక్ష్యంగా నిలిచింది. పోలీసులు నిందితులు వినియోగించిన కర్రను, చెప్పును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా ఈ విషయాలు బయటపడ్డాయి. నిందితులు ముగ్గురితో సహా నాటు వైద్యురాలు మఠం పార్వతమ్మను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించడానికి దర్యాప్తు అధికారిగా దిశా మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ వెంకటరమయ్య వ్యవహరించారు. కేసును అత్యంత తక్కువ సమయంలో ఛేదించిన సిబ్బందిని ఎఎస్పీ డి.ప్రసాద్ అభినందించారు. దిశా డీఎస్పీ వెంకటరామయ్య, కర్నూలు టౌన్ డీఎస్పీ కెవి.మహేష్, రూరల్ సిఐ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ ప్రసాద్

19న కెవిఆర్‌లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 19న జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మార్కాపురంలో బంకులను కూల్చిన రెవెన్యూ అధికారులు

- హైకోర్టు ఉత్తర్వుల సమయం ఉన్నా కూల్చడం ఏమిటని ప్రశ్నిస్తున్న బాధితులు
- ఉన్నతాధికారులు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం కె.మార్కాపురం గ్రామంలో కొందరు వేసుకున్న బంకులను మండల రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా బాధితులు కే శేషన్న, టి ఏకాంతుడు, చిన్న సోమన్న మాట్లాడుతూ తాము కొంత కాలంగా మార్కాపురం గ్రామంలో చిన్న బంకులు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నామని, అందులో టీ బంకు, బార్బర్ షాప్, చిన్న కొట్టు వేసుకున్నామని తెలిపారు. ఈ బంకుల వలన గ్రామ ప్రజలకు, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. అయినా మండల రెవెన్యూ ఆఫీసర్‌లు పోలీసు సిబ్బందితో వచ్చి బంకులను జెసిబితో ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. దీనివలన మాకు జీవనోపాధి లేకుండా పోయిందని, ఆర్థికంగా నష్టపరిచి చాలా ఇబ్బందులు కలగజేసినారని తెలిపారు. బంకులను తొలగించకూడదని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా, వాటిని ఎమ్మార్వోకి చూపించినా లెక్కచేయకుండా ధ్వంసం చేశారన్నారు. కోర్టు ఉత్తర్వులు లెక్కచేయకుండా ప్రవర్తించిన అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని జరిగిన నష్టానికి నష్టపరిహారం చెల్లించి బంకులను అదే స్థానంలో ఏర్పాటు చేయించి జీవనోపాధి కల్పించాలని ఉన్నతాధికారులను కోరారు.

జెసిబితో బంకును కూల్చివేస్తున్న దృశ్యం

రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి

- మద్దికెర, పత్తికొండలో సిపిఎం, సిపిఐ రైతు రక్షణ కాలినడక యాత్రలో నేతలు

ప్రజాశక్తి - మద్దికెర

అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు పత్తి, వేరుశనగ, ఆముదం పంటలకు ఎకరాకు రూ.40 వేలు, మిరపకు రూ.60 వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్, సిపిఎం తాలూకా ఇంచార్జ్ వీరశేఖర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మద్దికెరలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రైతు రక్షణ కాలినడక యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రారంభంలో మంచి వర్షాలు అనుకూలమైన సమయంలో రావడం వలన పత్తి ధర ఉందని ఎకరాకు 60 వేల వరకు పెట్టుబడి పెట్టి రైతులు లక్షల ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. 31 రకాల కంపెనీలు ఏకకాలంలో కూడగట్టుకొని సిండికేట్‌గా మారి నకిలీ విత్తనాలు అమ్మడంతో పత్తి చెట్లకు కాయలు, పూత లేక తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు న్యాయబద్ధమైన పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువకు మార్చి చివరి వరకు నీళ్లు వదలాలని, పంటల బీమా పథకాన్ని పూర్తిస్థాయిలో వర్తింపజేయాలి, ఖరీఫ్ సీజన్లో రైతులు బ్యాంకులో తీసుకున్న పంట రుణాలను రద్దు చేయాలని, వలసలు ఆపడానికి ఉపాధి కింద పనులు కల్పించి రోజుకు 500 రూపాయలు కూలీ ఇవ్వాలని, నకిలీ విత్తనాలు అమ్మిన కంపెనీల లైసెన్సులను రద్దు చేసి, తక్షణమే వారిని అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మద్దతుగా పాల్గొన్నారు. సిపిఐ నాయకులు గోవిందు, గురుదాస్, కారన్న, రాజ సాహెబ్, కౌలు రైతు సంఘం కార్యదర్శి హనుమప్ప యాదవ్, నాగరాజు యాదవ్, ఎస్ఎఫ్ఎస్ఐ నాయకుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. **పత్తికొండ :** అధిక వర్షాలు నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. రామచంద్రయ్య, సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బత్తిని వెంకట్ రాముడు డిమాండ్ చేశారు. రైతు రక్షణ కాలినడక పాదయాత్ర మద్దికెర మండలం నుండి పెరవలి, రాతన, పత్తికొండ చేరుకుంది. నాలుగు స్తంభాల కూడలిలో జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. అధిక వర్షాల వల్ల నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేలు చెల్లించాలని, మిర్చి ఉల్లి టమోటా రైతులకు ఎకరాకు రూ.60 వేలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రాజా సాహెబ్, వ్యకాసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నబి రసూల్ రైతు సంఘం బృందం, రైతులు తదితరులు పాల్గొన్నారు. సభను ముగించుకొని సిపిఐ కార్యాలయంలో రాత్రి బస చేయనున్నారు. ఉదయం దూదేకుండ, దేవనకొండ మీదుగా రైతు సంఘం బృందం బయలుదేరుతుంది.

మద్దికెరలో మాట్లాడుతున్న నాయకులు

పత్తికొండలో మాట్లాడుతున్న నాయకులు

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలో గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి రఘుపతి జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల స్టేట్ సెక్రటరీ రామాంజినేయులు సారథ్యం లో ప్రకాశం జిల్లా అర్ధవీడులో గత అక్టోబర్ నెలలో 22, 23న జరిగిన రగ్బీలో రాణించాడు. ఈ నెల గుజరాత్‌లోని గాంధీ నగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలో రఘుపతి పాల్గొననున్నారని పిఈటీ రవికుమార్, పిడీ రాఘవేంద్రలు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థి రఘుపతి

గడియారం హాస్పిటల్‌లో వైద్యులను, సిబ్బందిని నియమించాలి

- మౌలిక వసతులు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్.

కర్నూలు నగరంలోని గడియారం హాస్పిటల్‌కు 100 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉందని, ఈ ఆసుపత్రిలో కర్నూలు జనాభాలోని సగం ఇక్కడే జన్మించారంటే అతిశయోక్తి కాదని, అటువంటి ఈ ఆసుపత్రి ఈరోజు తల్లిదండ్రి లేని అనాథగా మారిందని, వెంటనే వైద్యులను, సిబ్బందిని నియమించి, మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు మొహమ్మద్ షరీఫ్‌లు డిమాండ్ చేశారు. వైద్యులను, సిబ్బందిని నియమించి, మౌళిక వసతులు కల్పించాలని కోరుతూ సిపిఎం నగర కార్యదర్శి, అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం.రాజశేఖర్, ముహమ్మద్ షరీఫ్‌లు పాల్గొని మాట్లాడారు. కర్నూలు నగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న అనేక గ్రామాల మహిళలు వచ్చి ఇక్కడ కాన్పులు చేయించుకునేవారని తెలిపారు. సిపిఎంగా గతంలో చేసిన పోరాటాల ఫలితంగా గడియారం ఆస్పత్రికి కొంత మహర్దశ ఏర్పడిందని, అయితే డాక్టర్లను పర్మినెంట్‌గా నియమించకపోవడంతో, డిప్యూ టేషన్‌పై వెళ్తున్నారని, ఉన్న సిబ్బంది రిటైర్డ్ అయితే భర్తీ చేసే ప్రసక్తే లేకుండా పోయిందని అన్నారు. ప్రజల ఆరోగ్యాల పట్ల, ప్రాణాల పట్ల పాలక వర్గాల వైఖరి ఏమిటో స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. తక్షణమే వైద్యులను, సిబ్బందిని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి పి.ఇక్బాల్ హుస్సేన్ ఈ కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ మాట్లాడారు. పాణ్యం, కోడుమూరు, కర్నూలు ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, సుధాకర్‌లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ ఆసుపత్రి అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గడియారం ఆసుపత్రి అభివృద్ధి కోరుకునే వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంతకాల సేకరణ చేపడుతున్న సిపిఎం నాయకులు

ఆర్‌యులో భారీ అంబేద్కర్ విగ్రహం

- రూ.10 లక్షలతో విగ్రహ నిర్మాణ పనులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోనే ఏ విశ్వవిద్యాలయంలో లేనటువంటి అంబేద్కర్ భారీ విగ్రహాన్ని రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమయింది. విశ్వవిద్యాలయంలో దాదాపుగా పది అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు వర్సిటీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రూ.10 లక్షలు నిధులను విగ్రహ ఏర్పాటుకు ఖర్చు చేయనున్నారు. విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహాన్ని భారీ స్థాయిలో ఏర్పాటు చేసేందుకు వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆనందరావు దృష్టి సారించారు. ప్రస్తుతం కృష్ణ విశ్వవిద్యాలయంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం కంటే ఎక్కువ ఎత్తులో రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహం ఏర్పాటుకు టెండర్లు కూడా పిలిచారు. ఈ టెండర్ ప్రక్రియ ద్వారా విగ్రహం ఏర్పాటు నిర్మాణ పనులను సంస్థకు అప్పగించి త్వరగా పూర్తి చేసేలా వర్సిటీ ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. అలాగే విగ్రహం చుట్టూ అభివృద్ధి చేసేందుక నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు వర్సిటీ రిజిస్టర్ మధుసూదన్ వర్మ వెల్లడించారు. ఈ పనులను త్వరగా చేపట్టి పూర్తి చేసేందుకు దృష్టి సారించినట్లు ఆయన వెల్లడించారు

చేయూత మహిళా మార్ట్‌ను పరిశీలన

ప్రజాశక్తి - కోడుమూరు

కోడుమూరులోని చేయూత మహిళ మార్ట్‌ను పథక సంచాలకులు డిఆర్డీఎ-వైకెపి యం.వెంకట సుబ్బయ్య శుక్రవారం సందర్శించారు. కార్యక్రమంలో ఎపిడి శ్రీధర్ రావు, డిపియం డైరీ అనిల్, ఎపియం పుష్పవతి, సిసిలు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య

ప్రజాశక్తి - ఆదోని

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, వెంకటేశులు విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని శ్రీనివాస భవన్ సర్కిల్‌లో రైతు రక్షణ కాలినడక యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రకు సిపిఎం సీనియర్ నాయకులు రామాంజనేయులు, మహానంద రెడ్డి, ఆదోని పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ మద్దతు ప్రకటించారు. యాత్రను రామచంద్రయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆస్పరి, దేవనకొండ, కోడుమూరు మీదుగా యాత్ర సాగుతుందని తెలిపారు. ఈ నెల 20న కలెక్టరేట్ ముందు ఆందోళన ఉంటుందన్నారు. అకాల వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్న కనీసం రైతులను పరామర్శించిన దాఖలాలు కూడా లేవని ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. వచ్చే ఎన్నికల్లో రైతుల ఆగ్రహానికి ప్రభుత్వాలు గురికాక తప్పదని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఆర్‌సిసి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, గోపాల్, శ్రీనివాసులు, రైతు కూలీ సంఘం నాయకులు ప్రసాద్, సిపిఐ ఎంఎల్ నాయకులు మల్లికార్జున, సిపిఐ నాయకులు అజయ్ బాబు, వీరేష్, సుదర్శన్, కల్లుబావి రాజు, విజయ్, వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని రాఘవేంద్ర సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ మద్దతు తెలిపారు. సిపిఐ నాయకులు రంగన్న, భాస్కర్ యాదవ్, పంపన్న గౌడ్, లోకేష్, శ్రీరాములు, థామస్, రాజు, వీరేష్, విజయేంద్ర, చిన్నన్న, రామాంజి పాల్గొన్నారు. **నందవరం** బస్టాండ్ ప్రాంతంలో సభ నిర్వహించారు. అంతకుముందు మంత్రాలయం నుంచి బయల్దేరిన యాత్రకు ఘన స్వాగతం పలికారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా సమితి సభ్యులు రంగన్న, సిపిఐ నాయకులు సోమేశ్వర రెడ్డి, గిడ్డయ్య, భీమన్న, విజయ్ పాల్గొన్నారు. **ఆస్పరి**కి చేరుకున్న యాత్ర బృందానికి అపూర్వ స్వాగతం లభించింది. సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, వ్యకాస నాయకులు బాలకృష్ణ, రైతు సంఘం, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు రెడ్డి, రంగస్వామి, రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, నాగేంద్రప్పలు పాల్గొని శంకరబండ గ్రామం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం, హనుమంతు మాట్లాడారు. సిపిఎం, సిపిఐ నాయకులు రంగప్ప, అంజినయ్య, బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, కృష్ణమూర్తి, రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం కర్నూలు రోడ్డులోని సాయి బాబా దేవాలయం దగ్గర రాత్రి బస చేశారు. శనివారం ఉదయం బిల్లేకలు మీదుగా దేవనకొండ మండలంలోకి చేరుకుంటుంది.

ఆదోనిలో యాత్రనుద్దేశించి మాట్లాడుతున్న రామాంజనేయులు

మంత్రాలయంలో మాట్లాడుతున్న నాయకులు

మహిళలు స్వయం సమృద్ధితో ఎదగాలి

- మహిళా మార్ట్ ఏర్పాటు చేసుకోవాలి

- ఆడ, మగ పిల్లలను సమానంగా చూడండి - పీడీ వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - దేవనకొండ

మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ వెంకటసుబ్బయ్య

మహిళలు స్వయం సమృద్ధితో ఆర్థికంగా ఎదిగి కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని, బాలిక, బాలుర సమాన విద్యాభివృద్ధికి కృషి చేయాలని డిఆర్‌డిఎ పీడీ వెంకటసుబ్బయ్య కోరారు. శుక్రవారం దేవనకొండ వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో సిబ్బందితో మహిళా మార్ట్‌పై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సూపర్ మార్కెట్‌లో అన్ని రకాల నిత్యావసర సరుకులు రాయితీతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవన సముదాయం, జిఎస్‌టి, మ్యాక్ రిజిస్ట్రేషన్ వంటి పనులు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పొదుపు మహిళలు బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాల రికవరీ సక్రమంగా ఉండేలా విఒఎలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలపై జరిగే గృహ హింస ఫిర్యాదులను గ్రామైక్య సంఘాల ద్వారా వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో అందజేయాలన్నారు. ఏపీడీ శ్రీధర్, డిపిఎం అనిల్, ఎంపిడిఒ గౌరీ దేవి, ఎసి రాఘవేంద్ర, ఎపిఎం రమేష్, ఆర్‌జిబి బ్యాంకు మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్‌ను వృథా చేయరాదు

- ట్రాన్స్‌కో ఇఇ మురళీధర్ బాబు

ప్రజాశక్తి - ఆదోని

కార్యక్రమంలో మాట్లాడుతున్న మురళీధర్ బాబు

అవసరానికి సరిపడే విద్యుత్‌ను మాత్రమే ఉపయోగించి, పొదుపు చేయాలని ట్రాన్స్‌కో ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీధర్ బాబు, అడిషనల్ డిప్యూటీ ఇంజినీర్ పురుషోత్తం తెలిపారు. శుక్రవారం విద్యుత్ భవన్ నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి శ్రీనివాస భవన్, భీమాస్ సర్కిల్ వరకు మున్సిపల్ మెయిన్ రోడ్డు గుండా విద్యుత్ పొదుపుపై వారోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో ఫ్యాన్లు, లైట్లు పూర్తిగా ఆర్పి వేయాలని తెలిపారు. ఉన్న గదిలో మాత్రమే ఫ్యాన్లు, లైట్లు వెలిగేలా చూసుకోవాలని సూచించారు. అవసరం లేకున్నా విద్యుత్ వాడకం వల్ల సంస్థపై భారం పడుతుందని తెలిపారు. విద్యుత్‌ను పొదుపు చేసి సంస్థ మనుగడకు సహకరించాలని కోరారు. ఈనెల 20 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించి ముగింపు సందర్భంగా విద్యుత్ పొదుపు వల్ల ప్రయోజనాల గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. వినియోగదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామని, సహకరించాలని కోరారు. ట్రాన్స్‌కో ఎఇలు చెన్నయ్య, సంతోష్, శారద ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ

ప్రజాశక్తి - ఆదోని

అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. శుక్రవారం ఆదోని మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో డస్ట్ బిన్నుల ఉపయోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా 12 నుంచి క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు అలీం సిద్ధిక్ ఆధ్వర్యంలో క్లాప్‌పై అవగాహన కల్పించడానికి హైస్కూల్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ ఉన్నారు.

అవగాహన ర్యాలీ : నీటిని వేడి చేసుకుని తాగాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి సూచించారు. స్వచ్ఛ తాగునీరు ఆవశ్యకతపై అవగాహన ప్రదర్శన మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ రోడ్డు గుండా సాగింది. ఆదోని పట్టణ వాసులకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇళ్లలో కూడా తాగునీటిని వేడి చేసుకుని తాగాలని సూచించారు.

పచ్చని పంటను చిదిమేశారు...

- రెండెకరాల మిరప పంట ధ్వంసం...

- రూ.2 లక్షలు నష్టం - దళిత రైతు ఆవేదన

ప్రజాశక్తి - ఆలూరు

ధ్వంసం చేసిన పంటను చూపుతున్న రైతు

పచ్చని పంటను గుర్తుతెలియని వ్యక్తులు చిదిమేసిన సంఘటన శుక్రవారం కురుకుంద గ్రామంలో చోటుచేసుకుంది. కురుకుంద గ్రామానికి చెందిన హరిజన దేవరాజ్ వ్యవసాయ బోరు కింద రెండెకరాల్లో మిరప పంట సాగు చేశారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఊచకోత కోశారు. శుక్రవారం ఉదయం పొలానికి వచ్చిన రైతు ధ్వంసమైన పంటను చూసి కుప్పకూలిపోయారు. పంట ధ్వంసం కావడంతో రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. పంటను ధ్వంసం చేసిన వారిని శిక్షించి ప్రభుత్వం తనకు పరిహారం ఇవ్వాలని బాధిత రైతు కోరారు. ఆలూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'సర్వేను వేగవంతం చేయాలి'

ప్రజాశక్తి - హాలహర్వి

ఆయుష్మాన్ భారత్ సర్వేను వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఆంథోని వాలంటీర్లకు సూచించారు. శుక్రవారం స్థానిక హాలహర్వి సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయ సేవలను విస్తృతం చేయాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరువ చేయాలని చెప్పారు. బియ్యం కార్డులు, ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. సెక్రటరీ ఈరన్న పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద వరం

- ఎంపిడిఒ దాసు నాయక్

ప్రజాశక్తి - హొళగుంద

భోజనం చేస్తున్న ఎంపిడిఒ

జగనన్న గోరుముద్ద పథకం విద్యార్థులకు వరంలాంటిదని ఎంపిడిఒ దాసు నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక మదర్స పాఠశాలలో జగనన్న గోరుముద్ద (మధ్యాహ్న భోజనం) అమలు తీరును పరిశీలించారు. సక్రమంగా అమలు అవుతుందా లేదా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా లేదా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాణ్యత శాతం పెంచాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. ఇఒఆర్‌డి చంద్రమౌళీశ్వర గౌడ్, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ షఫీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఆదోని విద్యార్థులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14 క్రికెట్ ఎంపిక పోటీల్లో ఆదోని మిల్టన్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అక్షయ్ కుమార్, కిడ్డీస్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మల్లికార్జునలు ప్రతిభ కనబరిచారు. నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు కర్నూలు జిల్లా జట్టుకు ఎంపికయినట్లు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విట్టా రమేష్, వైస్ ప్రెసిడెంట్ ముజీబ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆదోనిలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విట్టా రమేష్ మాట్లాడారు. ఆదోనిలో క్రీడాకారులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహకాలు అందజేయాలని కోరారు. ఇటీవలే అంజలి శర్వాణి జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం శుభపరిణామమని చెప్పారు. ఈ కోవలోనే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కంబి రెడ్డి, మోహన్, క్రికెట్ కోచ్ బాలాజీ ఉన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నంచర్ల గ్రామంలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయడం సంతృప్తికరంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం తెలిపారు. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనతో పాటు మధ్యాహ్న భోజనాన్ని అందించి పేద విద్యార్థులు చదువులకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం గ్రామస్తులు విలేకరులతో మాట్లాడారు. నంచర్ల పాఠశాలలో ఉపాధ్యాయులు కూడా మధ్యాహ్న భోజనం మెనూ విషయంలో రాజీ పడకుండా నాణ్యమైన భోజనం చేయిస్తున్నారని తెలిపారు. నంచర్ల గ్రామంలో విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలోనే అన్ని వసతులు కలిగి విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు.

IN THE COURT OF HONBLE SENIOR CIVIL JUDGE, ADONI
S.OP : 17/2022

Between :
1. K.Ravi
2. M.Usha Rani. ...Petitioners

And

Nill. ...Respondent

ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయడం ఏమనగా పోతి కె.రామరాజు గారి భార్య కె.లక్ష్మీ అలియాస్ కె.లక్ష్మీ దేవి మరియు వీరి పుత్రుడు కె.రవి, పుత్రిక ఎం.ఉషారాణి, అను అర్జిదారులు మహారాజశ్రీ ఆదోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో మొదటి పిటీషనర్ల యొక్క తండ్రి కె.రామరాజు 30-09-2021 తేదిన మరణించినాడని పిటీషనర్లు అయిన తాము అతని వారసులమని మొదటి పిటీషనర్లు పోస్ట్ ఆఫీస్ వారు, కె. రామరాజు యొక్క కుటుంబ సభ్యులు తాము మాత్రమేనని విన్నవించుకొన్నామని పోస్ట్ ఆఫీస్ వారు కె. రామరాజు యొక్క కుటుంబ సభ్యులు ధృవీకరణ పత్రము మంజూరు చేయుటకు సక్సెషన్ సర్టిఫికేటు కోరియున్నారని, అందువల్ల అర్జిదారులు/పిటిషనర్లు కె.రామరాజు యొక్క కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రము పోస్ట్ ఆఫీస్ వారు సక్సెషన్ సర్టిఫికేటును తమ పేరుమీదుగా ఇవ్వవల సినదిగా S.OP : 17 OF 2022 అను అర్జిదాఖలు చేసియున్నారు. ఇందు గురించి ఎవరికైన ఏమైనా అభ్యంతరములు కాని, ఆక్షేపణలు కాని ఉన్న యెడల ఆదోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 02-01-2023 తేదిన ఉదయం 10:30 గంటలకు హాజరై మీ అభ్యంతరములను,ఆక్షేపణలను తెలుపవయునని తెలియజేయడమైనది.

ఎల్.కె.జీవన్ సింగ్, యల్.యల్.బి,
పిటీషనర్ల తరపున అడ్వకేట్,
ఆదోని,
సెల్: 9963371444

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు కర్నూలు
అట్ ఆదోని
Guardian O.P. 25/2022

Between:
మంగలి సుబ్బమ్మ W/O మంగలి నరసింహులు ...పిటిషనర్

V/S

To whomsoever it may concern (NIL). ...రెస్పాండెంట్

To

జనరల్ నోటీసు టు పబ్లిక్

ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయడమేమనగా పైన తెలిపిన పిటీషనర్ అయిన మంగలి సుబ్బమ్మ తన మైనర్ కుమారుడు మంగలి నరేష్ కు 30/06/2015 వ తేదీన రిజిస్టర్ విభాగ దస్తావేజు ద్వారా సంక్రమించిన క్రింద కనపరచిన ఆస్తి చెందినది. తన మైనర్ కుమారుడు అయిన మంగలి వినయ్, సంక్షేమ మరియు చదువుల యొక్క ఖర్చుల నిమిత్తము షెడ్యూల్ దాఖలు భూమిని అమ్ముటకు పిటీషనర్ అయిన మంగలి సుబ్బమ్మ ను నియమించుటకు రెండవ అదనపు జిల్లా కోర్టు, ఆదోని వారికి దాఖలుచేసియున్నారు. కావున ఎవరికైనా ఆక్షేపణలు గాని, అభ్యంతరములుగాని వున్న యెడల తేది: 21/12/2022, ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ముందు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపవచ్చును. ఎవ్వరూ హాజరు కానియెడలపై కోర్టు వారు కేసును పిటీషనర్. పరముగా తీర్మానము చేయుదురు.

కర్నూలు జిల్లా యెమ్మిగనూర్ సబ్ జిల్లా
H. మురవణి గ్రామం.
సర్వే నంబరు: 769/3, విస్తీర్ణం 0.95 ఏకరములు.
చెక్కుబంది : తూర్పు: కురువ నరసప్ప భూమి.
పడమర : మంగలి చిన్న లింగన్న భూమి
ఉత్తరము : కొండమీది నబిసాబ్ భూమి
దక్షిణము : మంగలి సరేశ్ భూమి

కోర్టు వారి ఆర్డరు మేరకు

వాయిదా తేది : 21/12/2022

యం.జగదీశ్వర గౌడ,
శ్రీ .ఏ.దినేష్
పిటిషనర్ తరపున అడ్వొకేట్స్,
యెమ్మిగనూర్
మొబైల్ : 7013547388 / 9440346080

రాళ్లు, కంకర తేలిన రోడ్డు...

- గ్రామస్తుల ఇబ్బందులు

- దౌల్తాపురం రహదారికి గ్రావెల్ వేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని దౌల్తాపురం రహదారి రాళ్లు, కంకర తేలి నడవడానికి కూడా ఇబ్బందిగా మారింది. ఈ రహదారికి గ్రావెల్ వేయాలని గ్రామస్తులు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. చిప్పగిరి నుంచి దౌల్తాపురం, నంచర్ల గ్రామాలకు వెళ్లాలంటే అదే ఏకైక రహదారి. లేకపోతే గుంతకల్లు పట్టణానికి వెళ్లి గ్రామాలకు చేరుకోవాల్సి ఉంటుంది. చిప్పగిరి నుంచి దౌల్తాపురం, నంచర్ల గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని రాళ్లు, కంకర తేలింది. రైతులు, ప్రజలు నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. చిప్పగిరి రైతులకు దౌల్తాపురం గ్రామం వరకు పొలాలు ఉన్నాయి. కానీ ఎద్దుల బండ్లతో పోవడానికి ఎక్కడ కింద పడతాయోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. నంచర్ల, దౌల్తాపురం గ్రామం నుంచి చిప్పగిరికి వచ్చే వారు కూడా ఇబ్బంది పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఒక్కసారి కళ్లారా చూసి మట్టి గ్రావెల్ వేయాలని కోరుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడితే ద్విచక్ర వాహనాలు, ఎద్దుల బండ్లు వెళ్లడానికి వీలుగా ఉంటుందని పేర్కొంటున్నారు.

నడవడానికి కూడా ఇబ్బందిగా మారిన దౌల్తాపురం రహదారి

సామాజిక సేవలో ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలతోపాటు సామాజిక సేవలోనూ ఎస్ఎఫ్ఐ ముందుంటుదని ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో 15 మంది పేద విద్యార్థులకు దాతలు విజయ్ కుమార్, మంజునాథ, కిట్టు, రామ్మూర్తి సహకారంతో పరీక్ష ఫీజు చెల్లించారు. ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న పేద విద్యార్థులకు ప్రభుత్వం విద్యా దీవెన, వసతి దీవెన వెంటనే మంజూరు చేసి చదువుకు సహకరించాలని కోరారు.

చిన్నారి డిశ్చార్జీకి సహకరించాలి

- ఓ తండ్రి ఆవేదన

ప్రజాశక్తి - మంత్రాలయం

అంతుచిక్కని వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందిన చిన్నారి ఆస్పత్రి నుంచి డిశ్చార్జీకి డబ్బులు లేవని, దాతలు ఆర్థిక సహాయం అందించాలని శుక్రవారం ఓ తండ్రి ఆవేదనతో అభ్యర్థించారు. మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన షేక్ అక్బర్ కుమార్తె అంతుచిక్కని వ్యాధితో కర్ణాటకలోని బెంగళూరులోని ఇందిరా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్‌లో గత రెండు నెలలుగా చికిత్స పొందుతోంది. ఎంతకూ నయం కాకపోవడంతో ఇక పాపకు నయం కాదని, డిశ్చార్జీ తీసుకుని వెళ్లాలని వైద్యులు చెప్పారు. ఇప్పటి వరకు రూ.2 లక్షలు ఖర్చు చేసినా, డిశ్చార్జీ సెటిల్‌మెంట్ బిల్ ఇంకా రూ.76,884 కట్టాల్సి ఉంది. దాతలు ఎవరైనా సహాయం చేయాలని కోరారు. సహకరించాల్సి ఫోన్ నెంబర్ 9440447131.

రజత రథోత్సవ తయారీకి వెండి విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో నూతనంగా తయారు చేయించే వెండి రథోత్సవానికి ఓ భక్తుడు వెండిని విరాళంగా ఇచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన విజయ్ గులాన్ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చారు. దర్శనం అనంతరం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావును కలిసి 515 గ్రాముల వెండిని అందజేశారు. పీఠాధిపతులు శ్రీసుభుధేంద్రతీర్థులు దాతకు శేష వస్త్రం, ఫల మంత్రాక్షితలు అందజేశారు.

దాచుకోవడం... దోచుకోవడమే..!

- అభివృద్ధి శూన్యం - టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

రాష్ట్రంలో వైసిపి నాయకులు దాచుకోవడం... దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని సాతూనూరు గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు క్లస్టర్ ఇన్‌ఛార్జీ, మండల కన్వీనర్ జ్ఞానేష్ ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేక మూడు రాజధానుల పేరుతో కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ తుగ్లక్ పాలన కొనసాగిస్తున్నారని విమ ర్శించారు. ప్రజలకు మంచి జరగాలంటే టిడిపితోనే సాధ్యమని తెలిపారు. తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, జంపాపురం మాజీ సర్పంచి కృష్ణా రెడ్డి, సాతనూరు నాయకులు ఉలిగయ్య, వెంకటేష్, రామిరెడ్డి, వారం గోపాల్, రాముడు, రవి, హుస్సేని, నాగరాజు, పెద్ద భూంపల్లి జనార్ధన్, చిన్న భూంపల్లి చిన్న నరసింహులు, లక్ష్మయ్య, హుస్సేని, వెంకటేష్, ఐ టిడిపి అధ్యక్షులు సల్మాన్ రాజు, భూంపల్లి నీలకంఠ పాల్గొన్నారు. **కౌతాళం**లో 'ఇదేం ఖర్మ...మన రాష్ట్రానికి' నిర్వహించారు. టిడిపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ వెంకటపతి రాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అసమర్ధతను ప్రజలకు వివరించారు. రాజానందు, గొటయ్య పాల్గొన్నారు.

కోసిగిలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

కౌతాళంలో

సౌత్ జోన్ పోటీలకు రావూస్ విద్యార్థి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సౌత్ జోన్ ఫుట్ బాల్ పోటీలకు పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థి రాము ఎంపికయ్యారు. శుక్రవారం కళాశాల సిఇఒ తిరుమల రెడ్డి రామును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాయలసీమ యూనివర్సిటీ ప్రకటించిన ప్రాబబుల్స్‌లో రావూస్ విద్యార్థి రాముకు గోల్ కీపర్‌గా స్థానం దక్కిందని తెలిపారు. ప్రాబబుల్స్ ఈనెల 17 నుంచి 20 వరకు రాయలసీమ యూనివర్సిటీలో జరగనున్నాయని చెప్పారు. ఈ నెల 23 నుంచి 31 వరకు కేరళలోని కొట్టయామ్ యూనివర్సిటీలో సౌత్ జోన్ ఫుట్ బాల్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన రాముకు కళాశాల యాజమాన్యం కొంత మొత్తాన్ని సిఇఒ తిరుమలరెడ్డి ఆర్థిక సహాయంగా అందజేశారు. క్రీడల్లోనే కాకుండా చదువుల్లోను రాము బిఎ గ్రూపు టాపర్‌గా నిలుస్తున్నారు.

సరయిన ఆహారంతో ఆరోగ్యం పదిలం

- ఆయుర్వేద వైద్యులు పాండురంగారావు

ప్రజాశక్తి - మంత్రాలయం

సరయిన ఆహారంతో జీవిత కాలం ఆరోగ్యంగా ఉండవచ్చని ఆయుర్వేద వైద్యులు పాండురంగారావు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న వయస్సు నుంచే ఆకుకూరలు, కూరగాయలు తినడం వల్ల మంచి ఆరోగ్యం సంపాదించవచ్చని తెలిపారు. పొట్లకాయ, ఉసిరి, సోరకాయ వంటి కూరగాయలు రోజూ తీసుకోవాలని, వాటితో చాలా రకాల వ్యాధులు నయమవుతాయని చెప్పారు. కాళ్ల నొప్పులు, కడుపులోని గడ్డలు, ఇంకా అనేక రకాల వ్యాధుల నివారణకు ఇవి బాగా ఉపయోగపడతాయని తెలిపారు. తన దగ్గర చాలా రకాల క్యాన్సర్ వంటి వ్యాధులకు మందులు ఉన్నాయని, ఆయుర్వేదిక్ మందులతోనే నయం చేస్తానని చెప్పారు. అలాంటి వ్యాధిగ్రస్తులు ఎవరైనా ఉంటే తనను సంప్రదించాలని కోరారు. ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు బందే నవాజ్, ఉపాధ్యాయులు జగన్, రామన్న, ఉరుకుందు, కోటేశ్వరాచారి, అస్లాం బాష, పిఇటి నరసింహ రాజు, రోహిణి, పుష్పలత, ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం : జడ్‌పిటిసి

ప్రజాశక్తి - చిప్పగిరి

చదువుకున్న యువత క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలని, క్రీడల వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జడ్‌పిటిసి విరుపాక్షి తెలిపారు. గుంతకల్లు పట్టణంలోని రైల్వే గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. క్రికెట్ నిర్వాహక కమిటీ సూచనల మేరకు శుక్రవారం జడ్‌పిటిసి విరుపాక్షి మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు డొనేట్ చేశారు. ఈ సందర్భంగా విరుపాక్షి మాట్లాడారు. క్రీడల్లో నైపుణ్యం పెంచుకొని బాగా రాణిస్తే సమాజంలో పేరుతో పాటు కుటుంబానికి పేరు, ప్రఖ్యాతలు లభిస్తాయని తెలిపారు.

క్రికెట్ జట్టు సభ్యులకు ట్రోఫీ అందజేస్తున్న జడ్‌పిటిసి విరుపాక్షి

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి ఆలూరు
ఓ.ఎస్.నెంబరు 19/2021

మరియు:
ఎం.కమలాకర్. ...వాది

-వర్సెస్-

ఆర్.రంగన్న గౌడ్. ...ప్రతివాది

SUMMONS

TO
ఆర్. రంగన్న గౌడ్
తండ్రి ఆర్.సంగన్న గౌడ్,
హిందూ, వయస్సు 43 సం॥,
ఆర్/ఒ సిరగాపురం గ్రామము,
హాలహర్వి మండలము. ...ప్రతివాది

పైన పేర్కొన్న కేసులో వాది ప్రతివాది మీద కేసు దాఖలు చేసియున్నాడు. డబ్బులు తిరిగి రాబట్టుట కొరకు కేసు దాఖలు చేసియున్నారు. మీరుగాని మీ వకీలు ద్వారా గాని 19-01-2023వ తేదిన ఉదయం 10.30 గంటలకు హాజరు కావలెనని లేని యెడల మీకు పరోక్షంగా తీర్పు ఇవ్వడం జరుగుతుంది.

వాయిదా తేది: 19-01-2022

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

K.SREEDHAR, B.A.,LLB.,
ADVOCATE,
ADONI - 518301.(A.P)
CELL No:8985701165, 9705841725

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE:: KURNOOL
I.A.NO.434/2020 IN O.S.NO.681/2014

V.Brahamaiah ... PETITIONER/Plaintiff
Versus
V.Moldakallu died represented by his LRs 1 to 7 ...RESPONDENTS/Defendant

Notice to respondents 6 and 7

R.6 Smt. Sunkulamma
D/o late V.Moldakallu
Resident of Budidapadu village
Via K.Nagalapuram
Gudur Mandal,
Kurnool dt
R.7 Smt. Malleswari D/o
D/o late V.Moldakallu
Resident of Budidapadu village
Via K.Nagalapuram
Gudur Mandal,
Kurnool dt

Please take notice that the above mentioned petitioner/plaintiff filed the above IA 434/2020 seeking for condonation of Delay 780 in filing LR petition and matter stands posted to 19.12.2022 at 10.30 AM for your appearance in person or through your Advocate and file the objections if any. If you fail to appear on that date, the matter will be decided exparte.

With Court Order
Hearing Date.19.12.2022 at 10.30 AM

S.CH.MABU SAHEB,
ADVOCATE FOR PETITIONERS.
CH. MABU SAHEB
B.A, B.L.
ADVOCATE
H. No.81-290-1, Sarada Nagar,
KURNOOL-518 002, A.P. 9885974232

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు కర్నూలు
అట్ ఆదోని
Guardian OP. 27/2022

BETWEEN:
మంగలి సుబ్బమ్మ w/o మంగలి నరసింహులు. ...పిటిషనర్

V/S

To whomsoever it may concern (NIL). ...రెస్పాండెంట్

To

జనరల్ నోటీసు టు పబ్లిక్

ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయడమేమనగా పైన తెలిపిన పిటీషనర్ అయిన మంగలి సుబ్బమ్మ తన మైనర్ కుమారుడు మంగలి నరేష్ కు 30/06/2015 వ తేదీన రిజిస్టర్ విభాగ దస్తావేజు ద్వారా సంక్రమించిన క్రింద కనపరచిన ఆస్తి చెందినది. తన మైనర్ కుమారుడు అయిన మంగలి నరేష్, సంక్షేమ మరియు చదువుల యొక్క ఖర్చుల నిమిత్తము షెడ్యూల్ దాబల భూమిని అమ్ముటకు పిటీషనర్ అయిన మంగలి సుబ్బమ్మ ను నియమించుటకు రెండవ అదనపు జిల్లా కోర్టు, ఆదోని వారికి దాఖలుచేసియున్నారు. కావున ఎవరికైనా ఆక్షేపణలు గాని, అభ్యంతరములుగాని వున్న యెడల తేది: 20/12/2022, ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ముందు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపవచ్చును. ఎవ్వరూ హాజరు కానియెడల పై కోర్టు వారు కేసును పిటీషనర్ పరముగా తీర్మానము చేయుదురు.

షెడ్యూలు :
కర్నూలు జిల్లా యెమ్మిగనూర్ సబ్ జిల్లా
H. మురవణి గ్రామం.
సర్వే నెంబరు 769/3, విస్తీర్ణం 0.95 ఏకరములు
చెక్కుబంది :
తూర్పు : కురువ నరసప్ప భూమి
పడమర : మంగలి చిన్న లింగన్న భూమి
ఉత్తరము : మంగలి వినయ్ భూమి
దక్షిణము : పుండుకూర గుంటప్ప భూమి

కోర్టు వారి ఆర్డరు మేరకు

వాయిదా తేది : 20/12/2022

యం.జగదీశ్వర గౌడ,
శ్రీ .ఏ.దినేష్
పిటిషనర్ తరపున అడ్వొకేట్స్, యెమ్మిగనూర్
మొబైల్ : 7013547388 / 9440346080